క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

నేరడిగొండ: అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంజుల, ప్రేమల, ఎంపీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు వడూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు బాల అమృతం ద్వారా ఏడు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్యకళ, మమత, గంగామణి, రమ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



సమస్యలు విన్నవిస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని రమాయినగర్, సుందర్‌నగర్ గ్రామాలు ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలో నమోదు చేయకపోవడంతో కనీస అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. రమాయినగర్, సుందర్‌నగర్ గ్రామాలు ఏమాయికుంట పరిధిలో ఉన్నాయని, కాని గ్రామ పంచాయతీలో నమోదు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామాల ప్రజలు దహికాంబ్లే విక్రమ్, మాధవ్‌రావ్, శేషేరావ్, అరుణ్‌కుమార్, బండు, శోభాబాయి, కాంత, ఆశబాయి పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉందాం



సమావేశమైన గ్రామ పెద్దలు

నార్నూర్: కులమత వర్గ భేదాలు లేకుండా అన్నివర్గాల వారు ఐకమత్యంగా ఉండాలని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. సోమవారం అన్నివర్గాల మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. నార్నూర్‌లో అన్నివర్గాల ప్రజలు ఉన్నారని, వారికి అండగా నిలబడడం ప్రతీ ఒకరి బాధ్యత అన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలకు యువత దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో మాడవి మాన్కు పటేల్, అర్క గోవింద్, మాధవి ఆనందరావు, తోడసం వినోద్, రాథోడ్ ఉత్తమ్, పుష్కర్ జ్ఞానోబా, నర్సింగ్ మోరే, మహేందర్, దిగంబర్, కాంతారావు దుర్గే, షేక్ దాదే అలీ, రాథోడ్ దత్తరాం, ఆడే వసంత్ పాల్గొన్నారు.

డ్రై డే కచ్చితంగా చేపట్టాలి

నార్నూర్: ప్రతీ గ్రామంలో మంగళవారం, శుక్రవారం డ్రై డేను కచ్చితంగా చేపట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఒక గ్రూపుగా ఏ ర్పడి డ్రై డే కార్యక్రమంతో పాటు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. సీహెచ్‌వో లక్ష్మి, హెచ్‌ఈవో తులసీదాస్, పీహెచ్‌ఎన్‌వో సుశీల, హెల్త్‌సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, సత్తవ్వ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

బోథ్: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్ కుమార్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ.. తమ సొసైటీ కార్యాలయంలో ఓటరు నమోదు దరఖాస్తు ఫారంలు అందుబాటులో ఉన్నాయన్నారు. 18 ఏళ్లు నిండిన వారు తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు

బోథ్: చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని బోథ్ సీఐ రమేశ్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో మాట్లాడారు. గంజాయి సాగు చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు తమ పంట పొలాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేయవద్దన్నారు. విద్యుత్ తీగలకు బదులు సోలార్ కంచె వేసుకోవాలన్నారు.

ఆదర్శ గురుకులాలు మంజూరు చేయాలి

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన సమీకృత ఆదర్శ గురుకులాలను నియోజకవర్గానికి ఒకటి మంజూరు చేయించాలని కుల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతిపత్రం అందజేశారు. దీంతో రాబోయే తరానికి నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పీవో, ఆర్డీవోల దృష్టికి తీసుకుకెళ్తామన్నారు. ఆయా కుల సంఘాల నాయకులు బొంత ఆశారెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి, మర్సుకోల తిరుపతి, దాసండ్ల ప్రభాకర్, నర్సయ్య, లింగాగౌడ్, రాజేశ్వర్, బండి విజయ్, మహేందర్, రాజన్న పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి

- నివాళులర్పించిన ఉద్యోగులు, అధ్యాపకులు



ఆదిలాబాద్‌టౌన్: నివాళులర్పిస్తున్న సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఆదిలాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. కాళోజీ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నారాయణ రెడ్డి, మహేశ్వరి, దేవిచంద్, సుధాకర్, ప్రభావతి పాల్గొన్నారు.

- ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ గణపతి రఘు, పృథ్వీరాజ్, సమీర్, అనిత పాల్గొన్నారు.
- ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లెక్చరర్లు రడాపు సంతోష్ కుమార్, అరుణ్ కుమార్, చక్రవర్తి, రమాకాంత్‌గౌడ్, శ్రావణి, మంజుల పాల్గొన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా కాళోజీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సొసైటీ అధ్యక్షులు పోతన్న, ప్రధాన కార్యదర్శి రమేశ్, చిలుక సతీష్, పోశెట్టి పాల్గొన్నారు.

కై లాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకుని కొనియాడారు. డీఈ తిరుపతి, ఎస్ఐ నరేందర్, టీపీవో సుమలత పాల్గొన్నారు.

తాంసి: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఆయా గ్రామాల్లో కాళోజీ నారాయణరావు జయంతిని నిర్వహించారు. మండల కేంద్రములోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో, తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోష్, అధ్యాపకులు దేవేందర్, రమణ, తిరుపతి రెడ్డి, శివవర్ధన్, మల్లేష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: తెలంగాణ భాషకు పట్టం కట్టాలని నిలదీసిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ ఎంఏ కలీమ్, ఎంపీడీవో రాజ్‌వీర్‌లు, కార్యాలయ ఉద్యోగులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, ఆర్ఐ నాగోరావు, మీరబాయి, సంతోష్, సర్వేయర్ శంకర్ పాల్గొన్నారు.



కైలాస్‌నగర్: నివాళులర్పిస్తున్న బల్దియా అధికారులు

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్ జెడ్పీ పాఠశాలలో సోమవారం తెలంగాణ భాషాదినోత్సవం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు సుజన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ భాషా యాస జిల్లాకు ఒక్కవిధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తాంసి: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



బోథ్: పూలే సొసైటీ ఆధ్వర్యంలో..



నేరడిగొండ: పూలమాల వేస్తున్న తహసీల్దార్ కలీమ్

నిమజ్జనం సమయంలో జాగ్రత్తలు పాటించాలి



వలంటీర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: వాగులు, చెరువుల వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతాంలోని చాందా (టి) సమీపంలో వినాయక నిమజ్జనం వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. నీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట సీఐలు ఫణిధర్, కర్ణకర్‌రావ్, సునీల్ కుమార్, ఎస్సైలు ముజాహిద్, విష్ణు వర్ధన్, పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఓడ్ కులస్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



డిమాండ్ పత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ తమ సంక్షేమానికి, అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఓడ్ కులస్తులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో మాట్లాడారు. అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాజకీయ, విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. తమల్ని ఓబీసీ జాబితాలో చేర్పించాలని కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు అందించడంలో రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, ఓడ్ కుల సంఘం జిల్లా అధ్యక్షుడు చౌహాన్ ప్రకాశ్, నాయకులు సొలాంకే శంకర్, మారుతి, భీంరావ్, గణేష్, జాదవ్ అజయ్, సంగీత, కవిత పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తించాలి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

తాంసి: భీంపూర్ మండలంలోని గిరిజన గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించాలని భీంపూర్ గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఆదివాసీ గ్రామాల్లో వందశాతం గిరిజనులే నివాసం ఉంటున్నారని ఏజెన్సీగా గుర్తించాలని సోమవారం గోండ్వానా పంచాయత్ రాయిసెంటర్ అందర్‌బంద్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయిసెంటర్ సార్ మెడి అన్ను పటేల్ మాట్లాడుతూ.. తాంసి, భీంపూర్ మండలాల్లో వందశాతం గిరిజన గ్రామాలున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం గ్రామాలన్నింటిని ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మనోహర్, భీంరావు, రామేశ్వర్, జంగు, నాగోరావు, గేడం వినోద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తలమడుగు: ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. సురక్షితమైన ప్రయాణం కోసం ప్రతిఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలన్నారు. వికలాంగులకు బస్సు పాసులు, శుభకార్యాలకు రాయితీపై బుకింగ్, రోడ్డు భద్రతా నియమాల గురించి వివరించారు.

'డబ్బు సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదు'



యువకుడికి కండువా కప్పుతున్న కంది

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, డబ్బు సంపాదన కోసం రాలేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన పలువురు యువకులు, మహిళలు లోక ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కుంభఝరి,శివఘాట్, మత్తడిగూడ, తంతోలికి చెందిన పలువురు గ్రామస్తులు కాంగ్రెస్ చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గుండాలలో వైద్య శిబిరం

ఇచ్చోడ: మండలంలోని గుండాలలో సోమవారం నర్సాపూర్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు ఆధర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 114 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది రాథోడ్ కృష్ణ, రేణుక, సంగీత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల రాజేందర్ తండ్రి ఆకుల నడిపెన్న ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ గోడం నగేశ్ ఆయనను సోమవారం పరామర్శించారు. అనంతరం అందూర్ గ్రామంలో ఓ వ్యక్తి మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

జీవాలకు వ్యాధి నివారణ టీకాలు

బజార్‌హత్నూర్: మండలంలోని బుర్కపల్లి గ్రామంలో గొర్రెలు, మేకల వ్యాధి నిరోధక పశువైద్యాధికారి ఫర్వేజ్ అహ్మద్ సోమవారం వేశారు. వర్షాకాలం వాతావరణ మార్పులతో గొర్రెలకు, మేకలకు తుమ్ములు, ముక్కు, కండ్ల నుంచి నీరు కారడం వంటివి వ్యాధులు సోకుతాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మారుతి, జగన్నాథ్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న గణనాథులు

బోథ్: మండలంలోని గణనాథులు ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. మూడో రోజు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చైతన్య, భగత్‌సింగ్, విద్యార్థి, శివభక్త మార్కండేయతో పాటు పలు గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'పారితోషకం ఇస్తేనే సర్వే చేస్తాం'

బోథ్: బీసీజీ సర్వే కోసం తమకు పూర్తిస్థాయి మెటిరియల్‌తో పాటు పారితోషకాన్ని ఇస్తేనే సర్వే చేస్తామని ఆశా కార్యకర్తలు పేర్కొన్నారు. సోమవారం మెడికల్ అధికారి నవీన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఈ విషయమై జిల్లా వైద్యాధికారిని కలవనున్నట్లు తెలిపారు. ఆశ కార్యకర్తలు సరస్వతి, అంబాలిల, రాజమణి, కృప ఉన్నారు.

సన్మానం.

తాంసి: మండలంలోని కప్పర్ల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శంషీర్ ఖాన్‌ను గ్రామస్తులు సోమవారం సన్మానించారు. పాఠశాల హెచ్ఎం జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నందుకు పాఠశాల ఆవరణలో సన్మానించారు. గ్రామ పెద్దలు మహేందర్, నారాయణ, గంగన్న ఉన్నారు.

బోథ్: మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, జేఏసీ మాజీ అధ్యక్షుడు, ధన్నూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అవార్డును అందుకున్న సందర్భంగా జూనియర్ లెక్చరర్ కొండ గోవర్ధన్, డిగ్రీ లెక్చరర్ జాడి తిరుపతి, మెరుగు సాయి కుమార్‌లు సోమవారం శాలువాతో సత్కరించారు.

అనారోగ్యంతో సబార్డినేట్ మృతి

నేరడిగొండ: ఎంపీడీవో కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్)గా విధులు నిర్వహిస్తున్న చెలికల పద్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురికాగా సోమవారం తన స్వగ్రామమైన మండలం ఝరి గ్రామంలో మృతి చెందారు. ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గంగారెడ్డి, టైపిస్ట్ శశికాంత్‌లు అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.20 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

కాత్లే శ్రీధర్‌కు అఖండ నేషనల్ నంది అవార్డు

ఇచ్చోడ: మండలంలోని దూబార్‌పేట్‌కు చెందిన ఆదివాసీ కళాకారుడు కాత్లే శ్రీధర్ సోమవారం హైదరాబాద్‌లో అఖండ నేషనల్ నంది అవార్డు అందుకున్నాడు. హైదరాబాద్ లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మోర్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నాడు.

మహిళా సాధికారతపై అవగాహన

ఇచ్చోడ: మండల కేంద్రంలో సోమవారం కేజీబీవీ పాఠశాలలో మహిళా సాధికారత, సఖీ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా సాధికారత జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద, కేజీబీవీ ప్రత్యేకాధికారి మల్లిక, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

బోథ్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో ఈనెల 11న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏఈ వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. బోథ్, ఇచ్చోడ, బజార్ హత్నూర్, నేరడిగొండ మండలాలకు చెందిన వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

పంట నష్టం సర్వే.

తాంసి: ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. కాగా భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామశివారులో పెన్‌గంగ వరద ప్రవాహంతో పత్తి, సోయా పంటలు దెబ్బతిన్నాయి. సోమవారం ఏఈవో సాయిప్రసాద్ దెబ్బతిన్న పంటచేలను రైతులతో కలిసి పరిశీలించారు. సర్వేలో భాగంగా వివరాలను నమోదు చేశారు.

'జితేంద్ర చౌదరిపై దాడిని ఖండిస్తున్నాం'

ఎదులాపురం: ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, త్రిపుర ప్రతి పక్ష నేత కామ్రేడ్ జితేంద్ర చౌదరి, ఆయన ఇంటిపై త్రిపుర రాష్ట్ర బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏజెన్సీలో అక్రమ వలసలు అరికట్టాలి



మాట్లాడుతున్న నాయకులు



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో 1970 తర్వాత అక్రమంగా వలస వచ్చిన మైనార్టీల గుర్తింపు పత్రాలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద మాట్లాడారు. ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి వెంటనే ఉరితీయాలన్నారు. ఉరి తీసేంతవరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. వలస వచ్చి ఏజెన్సీలో అక్రమ వ్యాపారాలు చేస్తూ గిరిజనులపై దాడి చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా కోకన్వీనర్ మెస్రం మానిక్ రావు, ఎత్మారావు, ఆడ శ్రీరామ్, పూసం ఈస్రు, ఆత్రం పరమేశ్వర్, కోవా జైతు, ఆత్రం రాము పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం, హత్యయత్నం చేసిన నిందితుడిని ఉరితీయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఏజెన్సీలో ఆదివాసీలపై రోజు రోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు సిడాం భీంరావ్, ఆర్క ఖమ్ము, మెస్రం జైరాం, కనక హనుమంత్‌రావ్, కోవ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం పొందుపర్చిన చట్టాలను ఏజెన్సీ ప్రాంతాల్లో పకడ్బందీగా అమలు చేయాలని పలువురు ఆదివాసీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని చించుఘాట్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు పటేల్ మాట్లాడారు. జైనూర్‌లో జరిగిన సంఘటనలో ఆదివాసీలపై అక్రమ కేసులు పెట్టడం సరైనది కాదన్నారు. వెంటనే కేసులను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నేతలు కుమ్ర నాగోరావ్, సోము, గణపతి, భీంరావ్, సాయికుమార్, అశోక్ పాల్గొన్నారు.

మృగాడికి ఉరి శిక్ష వేయాలి

ఉట్నూర్‌రూరల్: మృగాడికి ఉరి శిక్ష పడేంత వరకు ఉద్యమిస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా నాయకులు ప్రకటించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు పెందూర్ త్రిమూర్తి మాట్లాడారు. జైనూర్ ఘటనలో ఆదివాసీలపై ఎదురు దాడికి పాల్పడిన మైనార్టీలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టేకం హరి ప్రసాద్, పెందూర్ మోతీరాం, జనార్దన్, తుకారాం పాల్గొన్నారు.

- ఆదివాసీలపై పోలీసులు కేసులుపెట్టడం సరైంది కాదని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతం బాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు, భరత్ మహసభ జిల్లా అధ్యక్షురాలు పెందూర్ ప్రియాంక అన్నారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వలస వచ్చి అమాయక గిరిజనులపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. అర్క ఉమేశ్, చహకటి సూర్యరావు, గోవింద్‌రావు పాల్గొన్నారు.


ఇచ్చోడ: ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన దుండగుడిని ఉరితీసే వరకు పోరాడుతామని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో మాట్లాడారు. ఆదివాసీలపై దాడులు చేసిన మైనార్టీ ముస్లింలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కొడప నగేశ్, నైతం శేఖర్, ఆత్రం మహేందర్, సిడాం మురళీకృష్ణ, కాత్లే విఠల్, కొట్నాక్ జంగు పాల్గొన్నారు.

ఎదులాపురం: జైనూరులో ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యాయత్నానికి పాల్పడిన దుండగుడిని వెంటనే ఉరితీయాలని ఆదివాసీ సమాజ పెద్దలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. వలస వచ్చిన ముస్లింలను జైనూర్ ప్రాంతం నుంచి వెంటనే తరలించాలన్నారు. భూ బదలాయింపు, యజమాన్య హక్కు, ఆధార్ కార్డు, రేషన్ కార్డులను రద్దు చేయాలన్నారు. నాయకులు వెట్టి మనోజ్, సంబు, జంగు పటేల్, వరుణ్, గణపతి, కేశవ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా సార్‌మేడిగా గంగాధర్

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా సార్‌మేడిగా సిడాం గంగాధర్‌ను రాజ్‌గోండ్‌సేవా సమితి రాష్ట్ర సమితి సభ్యులు సోమవారం ఎన్నుకున్నారు. గుస్సాడిగుట్టలో నిర్వహించిన సమావేశంలో జిల్లా సార్‌మేడిగా కొనసాగుతున్న మెస్రం దుర్గును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. అన్ని రాయిసెంటర్ల సార్‌మేడిలు ఆమోదించాలని కోరారు. నాయకులు పెందూర్ ప్రభాకర్, మంగం విశంరావు, వెడ్మ కొద్దు, గేడం నిరంజన్‌లు పాల్గొన్నారు. సభ్యుల వివరాలను ఐటీడీఏ పీవో ఖుష్బూకు అందచేశారు.

ముగిసిన జిల్లాస్థాయి చెస్ పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చిన్నారులు

ఆదిలాబాద్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం ప్రారంభమైన అండర్- 11 బాల, బాలికల ఎంపిక పోటీలు సోమవారంతో ముగిశాయి. ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వామి మాట్లాడుతూ జిల్లాస్థాయి చెస్ పోటీల్లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారు ఈనెల 14 నుంచి హైదరాబాదులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. బాలికల విభాగంలో అంబటి సుకీర్తి మొదటి స్థానంలో నిలువగా, శన్విత, అక్షర వీణ, అక్షరలు వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచారు. అదేవిధంగా బాలుర విభాగంలో రుద్ర కేదార్ మొదటి స్థానంలో నిలువగా, శ్రీజన్ రెండవ స్థానం, అయాన్ మూడోవ, అన్షువర్ధన్ నాలుగు స్థానంలో నిలిచినట్లు స్వామి వివరించారు.

నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు



సూచనల చేస్తున్న డీఎస్పీ

జైనథ్: మండలంలోని డొల్లార వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై పెన్‌గంగలో ప్రతీ ఏటా నిర్వహించే గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డీఎస్పీ జీవన్ రెడ్డి పోలీసులను ఆదేశించారు. సోమవారం డొల్లార వద్ద నిమజ్జనం పాయింట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, సిబ్బంది ఉన్నారు.